SUNDAY SPECIAL సండే స్పెషల్

భారత్-పాక్ యుద్ధం నేనే ఆపా

ట్రేడ్ డీల్‌తోనే ఆగిందన్న ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

ఐదు జెట్‌లు కూలిపోయాయని నేను అనుకుంటున్నా. ఇవి అణ్వాయుధ సామర్థ్యం గల దేశాలు. ఒకదానిపై ఒకటి దాడులు చేస్తున్నాయి. ఇది ఒక కొత్త రకం యుద్ధంలా అనిపించింది. మీరు ఇటీవల ఇరాన్‌లో ఏం జరిగిందో చూశారు కదా. మేం వాళ్ల అణ్వాయుధ సామర్థ్యాన్ని పూర్తిగా ధ్వంసం చేశాం. కానీ భారత్‌పాక్ మధ్య తలెత్తిన ఘర్షణ తీవ్రంగా మారుతూ వస్తోంది. ఇరుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటూ ఉన్నారు. అయితే మేం ట్రేడ్ ద్వారా సమస్యను పరిష్కరించగలిగాం. మేం స్పష్టంగా చెప్పాం. మీరు ట్రేడ్ ఒప్పందం కావాలనుకుంటే, ఆయుధాలు ప్రయోగించడాన్ని ఆపాలి. ఎందుకంటే మీరు ఇద్దరూ అణ్వాయుధ సామర్థ్యం గల దేశాలు' అని ట్రంప్ తెలిపారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతను తానే ఆపినట్లు జులై 14న ట్రంప్ అన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో జరిగిన సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'మేం యుద్ధాలను పరిష్కారించడంలో చాలా విజయవంతం అయ్యాం. భారత్ పాకిస్థాన్ విషయానికొస్తే మరో వారం ఆలస్యం అయితే అణ్వాయుధ యుద్ధం జరిగేది. పరిస్థితులు చాలా దారుణంగా మారేది. అలా జరగకుండా ట్రేడ్ డీల్ ఉపయోగించాం. ఈ సమస్యను పరిష్కరించకపోతే ట్రేడ్ గురించి మీతో మాట్లాడబోమని చెప్పా. చివరకు వాళ్లు కాల్పుల విరమణకు వచ్చారు' అని ట్రంప్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ట్రంప్ వాదనను భారత్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. రెండు దేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్స్ (డీజీఎంఓ) మధ్య నేరుగా జరిగిన చర్చల ద్వారానే ఈ విరమణ ఒప్పందం జరిగినట్లు స్పష్టం చేస్తోంది. గత వారం ట్రంప్‌తో జరిగిన 35 నిమిషాల ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఇదే విషయాన్ని చెప్పారు. భారత్ ఎప్పుడూ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులో కూడా అంగీకరించబోదని నొక్కి చెప్పారు.

మన కాలం ఉద్యమ వీరుడు- వేలాద్రి

తెలంగాణలో ఉద్యమ వీరులకు కొదువ లేదు. చాలా మంది ఉద్యమకారులుగా పేరుపొందారు. కాని ఎంత మంది తాము నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారు. ఎంత మంది వారి జీవితాలను ప్రజలకు అంకితం చేశారు. ఉన్న ఒక్క జీవితం ప్రజలకే అంకితం చేసి, వారే తన ఆస్తిగా, పొద్దుగల్ల లేశినకాడికెళ్లి ప్రజా సేవనే శ్వాసగా బతుకుతున్నవారు ఎంత మంది? అటువంటి విలక్షణమైన వ్యక్తిత్వం గలవాడు, ఆ పేరు వినగానే చాలా మందికి ఉస్మానియా యూనివర్శిటీ గుర్తుకవస్తుంది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా ఉస్మానియా యూనివర్శిటీయే తన కేరాఫ్ అడ్రస్ గా మార్చుకున్నవాడు అతనే... మన 'దునుకు వేలాద్రి'. మొక్కవోని దీక్షతో నేటికి అంకిత భావంతో పనిచేస్తున్న వేలాద్రి జీవితం ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నది. అతను నిర్ణయించుకున్న జీవితం చాలా మందికి నచ్చకపోవచ్చు. ఉద్యమకారులుగా చెలామణి అవుతూ సిరి సంపదలలో తూగేవారికి రుచించక పోవచ్చు. ఆయన శ్రేయోభిలాశులకు బాధ కల్గించవచ్చు. అన్నింటికి చిరునవ్వుతో సమాధానమిస్తూ తన దారిలో సాగిపోతున్నాడు. తాను ఎంచుకున్న మార్గమే తనను ఎక్కడికన్నా తీసుకపోని అని అంటున్నాడు.

వ్యక్తిగా నిలబడడానికి యూనివర్శిటీ జీవితం చాలా అవసరం. కాని యూనివర్శిటీయే జీవితం అంటే చాలా సమస్యలు వస్తాయి. అట్లా ఉస్మానియా యూనివర్శిటీ, ఆర్ట్స్ కాలేజిలో జ్ఞానాన్ని ఆర్జిస్తూనే, ఉద్యమాలతో మమేకమైనాడు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న యూనివర్శిటీ నిత్య యవ్వనంగా జ్ఞానాన్ని అందిస్తున్నది. సుదీర్ఘమైన చదువులు, పోరాటాలతో సాగిన జీవితాలు స్థిరత్వం పొందలేక, సరైన అవకాశాలు లేక నాశనం అయి ఉండవచ్చు. ప్రపంచ జ్ఞానపు వాకిళ్లలో ఇది సహజం. కాని వేలాద్రి ఎంచుకున్న లక్ష్యం వేరు. తను పూర్తి కాలం విద్యార్థి రాజకీయాలలో ఉన్నాడు. వేరే లక్ష్యం నిర్ణయించుకునే స్థితి తనకు ఎప్పుడూ రాలేదు. ఉద్యమాలు కొనసాగుతున్నదుపుడు ఒక చారిత్రక అవసరంగా ఇక్కడ కొనసాగాడు. అతనిని ఆ ఉద్యమాలు ఊపిర సలుపనీయలేదు. యూనివర్శిటీకి వచ్చిన పిల్లలకు "చదువే మార్గం చూపుతుంది కావున కష్టపడి చదవమని కోరుతాడు". వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు నిత్యం కాంపిటేటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన క్లాసులు తన స్వంత డబ్బులతో ఏర్పాటు చేస్తాడు. అచ్చు వేలాద్రి జీవితం లాగానే ఒక వ్యక్తి 'పూర్తి జీవిత కాలం' జెఎన్ యులో గడిచింది. అతడే 'విద్రోహి'. పేరు వినడానికి వింతగా ఉన్నా... ద్రోహులకు ఆయన విద్రోహియే. అతని జీవితానికి వేలాద్రి జీవితానికి చాలా దెగ్గర సంబంధం ఉన్నది. ఆయన వేలాద్రిలాగానే నిత్యం వివిధ సమస్యల పైన పోరాడుతూ, బాకుల్లాంటి ప్రసంగాలతో విద్యార్థులను ఉత్తేజపర్చేవాడు. విద్రోహి ఇటీవలనే మరణించాడు. ఆయన ప్రసంగాలు యూట్యూబ్లో వినవచ్చు. వేలాద్రి ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం, చిన్న గోపతి గ్రామంలో పేద కుమ్మరి కుటుంబంలో జన్మించాడు. తన తండ్రి మన్నును పిసికి అద్భుతమైన కుండలు తయారు చేసి అమ్మేవాడు. అదే వారి జీవనాధారం. వేలాద్రి ఆరోగ్యంగా ఉంటే మన్నును పిసికి బతికేవాడో తెలియదు కాని, చిన్నపుడే పొలియో మహామ్మారి భారీన పడ్డాడు. చాలా వరకు ఒక కాలు బలహీనంగా మారింది. పూర్తి స్థాయిలో పొలియో రాలేదు. లేకుంటే వేలాద్రి శాశ్వతంగా అవటివాడయ్యేవాడే. తన తండ్రికి ఎక్కడలేని రంది పట్టుకున్నది "చివరి సంతానం. అల్లారు ముద్దుగా పెరుగుతాడనుకుంటే గిట్లయిపాయే... కాలం మారుతున్నది. తన వృత్తి ఇక ఎంత మాత్రము సాగదు. రేపు వీడు ఎట్లా బతుకుతాడు. ఏం పనిచేసుకొని బతుకుతాడు" అని. ఏదో పని మీద వారి ఊరికి వచ్చిన ఫాస్టర్తో తన కొడుకు పరిస్థితి గురించి చెప్పటంతో... "అక్షర జ్ఞానం ఉన్నవాడు ఎట్లానైనా బతుకుతాడు. ముందు నీ కొడుక్కి చదువు చెప్పించు" అని ఫాస్టర్ అనడంతో తన తండ్రికి చెప్పలేని సంతోషం వేసింది. ఒక మార్గం దొరికింది. తన కొడుకు చదువుకొని గొప్పవాడు కావాలి. ఎన్నేళ్లు ఈ మట్టి పిసుక్కొని బతుకుతాం. వాడు పెన్ను పట్టుకొని మా బతుకులు దిద్దాలి. మా కులంకు వాడు బతుకుదెరువు చూపెట్టేంతటోడు కావాలని ఆ తండ్రి ఆకాంక్షించాడు. ఆ రాత్రి ఆ తండ్రి నిద్ర పోలేదు. ఆనందం కట్టలు తెంచుకొని దునికింది. వేలాద్రి బలహీనమైన శరీరానికి మందు చదువే. అదే అతనిని వెతుక్కొంటు వచ్చింది. అపుడే క్రైస్తవం అణగారిన వర్గాలకు చదువు విలువ ఏమిటో చెపుతున్నది. ఊరి ఫాదర్ భార్య పేద పిల్లలను ఒక దెగ్గర చేర్చి అక్షరాలు నేర్పిస్తున్నది. అట్లా ఆ అమ్మ దెగ్గర అక్షరాలు నేర్చుకున్న వేలాద్రి బాల్యం ఆటపాటలతో బాగానే సాగింది. అక్షరాలు సరే... తరగతి విద్య కావాలి. ఊరిలో బడి లేదు. బడికి వెళ్లాలంటే ఎక్కడో పది పదిహేను మైళ్ల దూరం వెళ్లాలి. తన కొడుకు వెళ్లే పరిస్థితి లేదు. వసతి ఉన్న బడులైతే ఏ ఇబ్బంది ఉండదనుకున్నాడు. విధిగా క్రిస్టియన్ మిషనరీ స్కూళ్లలో వేలాద్రి విద్యాభ్యాసం మొదలైంది. ఇంటి మీది రందితో మొదట్లో చదువు అంతంత మాత్రంగా సాగినా తిరిగి గాడిలో పడింది. హైస్కూల్కు వచ్చేసరికి వేలాద్రియే స్కూల్ లీడర్. ఆ వయసులోనే స్కూల్ రాజకీయాలు వంటపట్టించుకున్నాడు. ఖమ్మంలో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లోనే విద్యార్థి నాయకుడిగా ఎదిగాడు. తిరిగి వెనుకకు చూసుకునే తీరిక లేకుండా నిరంతర ప్రవాహమై జలపాత హోరులా సాగాడు.

నిజాం కాలేజిలో డిగ్రీలో చేరడంతో వేలాద్రి జీవితం పూర్తిగా మారిపోయింది. అపుడే తెలంగాణ పల్లెల నుంచి బడుగు బలహీన వర్గాలకు చెందిన మొదటి తరం పిల్లలు రావడం మొదలైంది. అక్కడికి రావడం అంటేనే ఒక గొప్ప విజయం. దానిని నిలుపుకొని చదువుకోవడమంటే నిత్యం యుద్ధం చేయడమే. ఇక్కడ శత్రువు చాలా రూపాలలో ఉంటాడు. కనిపించి కనపడడు. ఈ యుద్ధంలో గెలిచేది కొందరే. ఆ యుద్ధ రంగానికి అన్నీ తానై నడిపే 'సేనాని' వేలాద్రి అవుతాడు. తన చదువును పక్కన పడేసి విద్యార్థి సమస్యల పైన పోరాటం చేశాడు. అజారుద్దీన్, కిరణ్ కుమార్ రెడ్డిలాంటి వాళ్లు క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆడే ఉన్నత వర్గాల పిల్లలు ఒక వైపు, నీళ్లతో కడుపు నింపుకొని క్లాసులకు హాజరయ్యే బహుజన పిల్లలు ఇంకో వైపు. ఈ అసమానతలు తనను ఉద్యమ బాట పట్టించాయి. స్కాలర్షిప్, మెస్, హాస్టల్ సమస్యలపై గుక్క తిప్పుకోకుండా పోరాడాడు. "ఆవాజ్ దో హమ్ ఏక్ హై", "విద్యార్థుల నాయకత్వం వర్ధిల్లాలి", "విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" కంగుమనే గొంతుతో నినాదాలిస్తే వంద మంది గొంతులు ఒక దిక్కు తన గొంతు ఒక దిక్కు నూనూగు మీసాల నూత్న యవ్వనంలో పోరాట జెండా పట్టాడు. వేల మైళ్లు ఒక అడుగుతో ప్రారంభమైనట్లు, అతని ఉద్యమ అడుగుల ద్వారానే ప్రతి ఉద్యమం మహా ప్రభంజనంగా మారేది. ఖిల్లా ఖమ్మంలో మొదలైన తన ప్రస్థానం ఉస్మానియా యూనివర్శిటీ వరకు కొనసాగింది. నిజాం కాలేజిలో డిగ్రీ, ఉస్మానియా క్యాంపస్ లో పి.జి, పిహెచ్‌డీలు. యూనివర్శిటీ రాజకీయాలను వంటపట్టించుకొన్న విద్యార్థి నాయకుడుగా మారాడు. విద్యార్థి సమస్యల పరిష్కారమే తన ఊపిరిగా మార్చుకున్నాడు. ఏ సమస్యలపై పోరాటం చేసాడో అవే సమస్యలు నిత్యం తనను పలకరించాయి. ఒకవైపు చదువు, ఇంకోవైపు పోరాటం. అందరూ చదువుకొని వెళ్లిపోతారు. కాని వేలాద్రి చదువుకునే వాళ్ల కోసం తన జీవితాన్ని కొవ్వత్తిలా కల్గించి విద్యార్థి ఉద్యమాలకు వెలుగైనాడు. క్యాంపస్నే తన ఇల్లుగా, వేదికగా మార్చుకున్నాడు. క్యాంపస్ లోనే ఉండడం అప్పటి ఉద్యమ అనివార్యం, లక్ష్యం కూడా కావచ్చు. "తను ఈ విధంగా తిరిగితే నా పిల్లనియ్య" అని తన మేనమామ, బంధువులు ఎన్ఆర్ఎస్ హాస్టల్ ముందర తెగ తెంపులు చేసుకున్నా, తన వైఖరి మార్చుకోలేదు. ఉద్యమకారుడికి పెళ్లి అవరోధంగా భావించాడు. ఏ బంధాలు లేనివాడిగా ప్రపంచమే తనదిగా సాగిపోతున్నాడు. యూనివర్శిటీ చరిత్రలో మైలురాళ్లుగా భావించే చాలా ఉద్యమాలలో వేలాద్రి ఉన్నాడు. మండల్ కమీషన్ పోరాటంలో యూనివర్శిటీలో నిప్పు రగిల్చాడు. 'హాస్టల్ మూసివేత'కు వ్యతిరేఖంగా పోరాడేటపుడు మరణ శయ్యపై తన అక్క ఉన్నా పంటి బిగువున బాధను భరించి, ఎందరో మంది విద్యార్థుల భవితవ్యం బుగ్గి కాకూడదని విద్యార్థి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. విలువైన చదువులు చదివిన ఒక తరం తరాన్నే 'ఒక పాలన' నిరుద్యోగులుగా, నిస్సహాయులుగా మార్చింది. అది చంద్రబాబు పాలన. ఆ పాలనలో ఉద్యోగాలు లేవు. పని చేయడానికి పని లేదు. ఇప్పటికి ఆ తరం కోలుకోలేదు అంటే ఆశ్చర్యం లేదు. నిత్యం ట్వంటీ ట్వంటి, ఐటియే జీవితం అనుకుంటూ సాగిన చంద్రబాబు పాలనను ప్రశ్నించాడు. ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ సబ్జెక్టులను చిన్నచూపు చూసే అగ్రకుల మనస్తత్వానికి ఎదురు నిలిచాడు. చరిత్ర సబ్జెక్టును తీసేసి చరిత్రహీనుడు కావద్దని చంద్రబాబును హెచ్చరించాడు. బాబుతో ముఖాముఖిగా ఘర్షణపడ్డాడు. 'నిరుద్యోగులకు అన్యాయం చేయవద్దు' అని గొంతెత్తాడు. ఆ పాలనా కాలంలో ర్యాలీలు ధర్నాలు నిత్య కృత్యంగా మారాయి. అప్పటి ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి వేలాద్రి లేవనెత్తిన నిరుద్యోగ సమస్యలన్నింటిని అసెంబ్లీలో ప్రస్తావించాడు. చంద్రబాబు పాలనలో ఎన్నో కొన్నో ఉద్యోగాలు వచ్చాయంటే అది వేలాద్రి కృషి ఫలితమే. తరువాత అధికారానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీతో కూడా విద్య, ఉద్యోగ విషయాలపైన నిత్య పోరాటం. వేలాద్రి పోరాట ఫలితంగా రెండు రాష్ట్రాలలో వేలాది మంది ఉద్యోగాలైతే పొందారు. ఇది నగ్న సత్యం. ప్రభుత్వాల మెడలు వంచి ఉద్యోగాలు సాధించగల్గాడు.

వేలాద్రి లేవనెత్తిన చాలా విషయాలు చట్టాలు ఆర్డినెన్సుగా మారాయి. దళిత క్రిస్టియన్లు దళితుల మాదిరిగా అన్నీ అవకాశాలు ఇవ్వాలని మొదటగా లేవనెత్తినవాడు వేలాద్రియే. యస్.సి సబ్లన్ విషయంలో సభలు ఏర్పాటు చేసి ఆ చట్టం అమలుకు తన వంతు కృషి చేశాడు. పోరాటాలే కాదు తన దెగ్గర ఏమిలేకున్నా ధాతృత్వంలో తనకు తానే సాటి. మేటి మన వేలాద్రి. ఒక సందర్భంలో, గల్ఫ్ బాధితుల పక్షాన కొట్లాడే రుద్రశంకర్ వేలాద్రిని కలసినపుడు తన వంతు సహాయంగా పదివేలు ఇచ్చి వెళ్లాడు. ఆయన ఇచ్చి వెళ్లిన వెంటనే, ఒక పేద విద్యార్థి వచ్చి "అన్నా... ఆర్.సి రెడ్డిలో కోచింగ్కు సహాయం చేయవా" అంటే... వెంటనే ఆ పదివేలు ఇచ్చి ఆదుకున్నాడు. "తనకంటూ ఏమి ఉంచుకోని త్యాగశీలి వేలాద్రి" ఈ కాలంలో మన కళ్ల ముందరున్నాడు. జీవిక కోసం అంబేడ్కర్ ఒపెన్ యూనివర్శిటీ క్లాసుల వల్ల వచ్చేది చాలంటాడు. స్వతహాగా ఉద్యమ కుటుంబం నుంచి వచ్చిన తాను రజాకార్లకు వ్యతిరేఖంగా పోరాడి చావు దెబ్బలు తిన్న తన తండ్రి ఆదర్శాన్ని పునికిపుచ్చుకున్నాడు. మొదటి నుంచి తెలంగాణ కోసం పోరాడే విద్యార్థి ఉద్యమాలకు ఆర్థికంగా, హార్థికంగా వెన్ను దన్నుగా నిలచి ఉన్నాడు వేలాద్రి. సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ఇటీవల చాలా కృషి చేశాడు. ప్రభుత్వం కూడా వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి పూనుకున్నది. బి.సిల స్థితిగతులపై కూడా ఒక వైపు సమగ్ర అధ్యయనం చేస్తూనే, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకవస్తున్నాడు. అంతే కాకుండా శుష్క ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు వేస్తున్నాడు. ఎన్నడూ అలసిపోని వేలాద్రి నిత్యం ప్రజల బాగుకోసం పరితపిస్తాడు.

ఒకడే ఎన్నో ఉద్యమాలను ప్రారంభించాడు. నేటి ఉద్యమకారులకు తనకు చాలా పోలిక ఉన్నది. నిస్వార్థంగా, ఏమి ఆశించకుండా పనిచేసేది ఎంత మంది? సుదీర్ఘమైన ఉద్యమ జీవితం వేలాద్రిది. ఏ పార్టీలో లేదు, ఏ సంఘంలో లేదు. లెఫ్టిస్టు, రైటిస్టులతో అసలే పేచి లేదు. కాని వివిధ సమస్యలపైన సంఘాలను, పార్టీలను ఒకటిగా తెస్తాడు. వాస్తవానికి ఐక్యతతోటే సగం సమస్య సచ్చినట్టయ్యేది. పెద్దన్నగా అందరి మన్నలను పొందాడు. "ఆర్ట్స్ కాలేజి ఫిఫ్టి సెవెన్ రూం" సాక్షిగా స్వంత ఆస్తి లేని మనిషి. సమాజమే తన ఆస్తిగా భావించే వేలాద్రన్నంటే అందరికి ఇష్టమే. మార్క్సిజం సొంత ఆస్థిని వ్యతిరేఖిస్తుంది. మరి... ఇయ్యాల 'సొంత ఆస్థి లేని మార్క్సిస్టులు' భూతద్దం పెట్టి వెతికినా మనకు కనిపించరేమో!" ఈ రోజుల్లో గోరంత చేస్తే కొండంత చెప్పుకుంటారు. కీర్తి, యశస్సులకు ఆమడ దూరంలో ఉండే వేలాద్రి ఏనాడు తన గురించి చెప్పుకోలేదు. ఒకప్పటి వి.సి 'యూనివర్శిటీలో ఉద్యోగమిస్తానంటే' తీసుకోలేదు. విశాలమైన రాజకీయ క్షేత్రంలో ఉండవలసినవాడు నౌకరీ చేస్తాడ! వేలాద్రి యూనివర్శిటీలోనే ఉన్నా తన పరిధి తెలుగు రాష్ట్రాలలో పరివ్యాప్తమైంది. యూనివర్శిటీ స్థాయిని పెంచాడే కాని ఎపుడూ దిగదార్చలేదు. వాస్తవానికి యూనివర్శిటీయే తనకు రుణపడి ఉన్నది. యూనివర్శిటీ పేరు చెప్పుకొని కొంతమంది లీడర్లు లెఫ్ట్, రైట్ అని తేడా లేకుండా ప్రైవేటు కాలేజీలు పెట్టుకొని లక్షలు సంపాదిస్తున్నారు.

కాని., ఎటువంటి ఆశ లేకుండా నిస్వార్థంగా సేవ చేసే వేలాద్రిలాంటివారు ఎందరుంటారు. విద్యార్థులకు, యూనివర్శిటీ ఉద్యోగులకు, డెయిలీ వేజ్ లేబర్లకు ఆయనంటే విపరీతమైన అభిమానం. వారి సమస్యల పరిష్కారానికై తన వంతు బాధ్యతగా ఎపుడూ వారి ఉద్యమాలలో భాగమవుతున్నాడు. చాలా మంది వేలాద్రి జీవితం తెలిసిన యూనివర్శిటీ ప్రొఫెసర్లు మదనపడి "ఇంకా ఎంత కాలం ఇలా ప్రజలకు సేవ చేస్తావు. మెయిన్ం పాలిటిక్స్లో చేరి యమ్.పి, యమ్ఎల్ఎ కావాలి" అంటే, "పార్టీలు తనను గుర్తించకున్నా తాను పూర్తికాలం రాజకీయాలలోనే ఉన్నానంటాడు. స్వతంత్రంగా, ఒక్క రూపాయి తీసుకోకుండా తను ఏ మంత్రి చేయని పనులు చేస్తున్నాను. నాకింకా పార్టీ ఏమి అవసరం" అంటాడు. నిజమే.. ఒక వ్యక్తిగా ఆయన చాలా చేస్తున్నాడు. కాని., సరియైన గుర్తింపు రావడంలేదు. "డెమొక్రటిక్ పాలిటిక్స్ను నమ్ముతున్నపుడు పార్టీలో చేరితే నష్టమేమిటని" చాలా మంది మేధావులు అడిగినా... తన పని ద్వారానే సమాధానం చెపుతున్నాడు. చాలా మంది యూనివర్శిటీ నుంచి నాయకులుగా ఎదిగినా వేలాద్రికి ఉండే కమిట్మెంట్ ముందు దిగదుడుపే. అందుకే వేలాద్రి "మన కాలం ఉద్యమ వీరుడు". వేల మంది జీవితాలను వెలిగించిన 'ఓయుద్ధ నౌక అక్షర యోధుడిగా మన మధ్య సంచరిస్తున్నాడు. కాలం వంతెన పై 'మద్దిమాను'లా వస్తున్న తరానికి నడక నేర్పుతున్నాడు.

- బి. వేణుగోపాల్ రెడ్డి,
9908171441, ఆదిలాబాద్

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369
39999